క్లుప్తంగా

పర్యావరణాన్ని పరిరక్షించాలి



పొన్నూరు: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్ బాబు అన్నారు. శనివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిడుబ్రోలులోని టిడ్కో గృహ సముదాయాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పట్టణంలోని పలు వార్డులలో కమిషనర్ పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. నిడుబ్రోలులోని రక్షిత తాగునీటి పథకాన్ని సందర్శించి నీటి సరఫరాకు వినియోగించే మోటార్ల పనితీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతిరోజు తాగునీటి నాణ్యతను పరిశీలించాలని, మీరు రంగు మారడం, వాసన రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి పాల్గొన్నారు.

వల్లూరి సేవలు చిరస్మరణీయం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు



పెదకాకాని: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శిగా, విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శిగా వల్లూరి గంగాధరరావు సమర్థంగా బాధ్యతలు నిర్వహించారని ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. సీపీఐ రాష్ట్ర నాయకులు వల్లూరి గంగాధరరావు 18వ వర్ధంతి ఆయన స్థూపం వద్ద శనివారం నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ వల్లూరు గంగాధరరావు 1959, 1970 సంవత్సరాలలో రెండు సార్లు పెదకాకాని సర్పంచిగా గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేశారన్నారు. స్థానిక హేమలత నూలు మిల్లు వర్కర్ సీనియర్ అధ్యక్షులుగా, ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్స్ మిల్లుల ప్రధాన కార్యదర్శిగా కార్మికుల సంక్షేమం కోసం విశేషంగా కృషి చేశారని కొనియాడారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాధాకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, రైతు సంఘం జిల్లా నాయకులు కొల్లి రంగారెడ్డి, వల్లూరి నాగార్జున, పి.సత్యనారాయణ, డేవిడ్ రాజు పాల్గొన్నారు.

సేవాభావంతో వైద్యసేవలు అందించాలి



పెదకాకాని: ప్రతి ఒక్కరూ సేవాభావంతో వైద్యసేవలు అందించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు ఆరోగ్య ఉపకేంద్రం, అంగన్‌వాడీ సెంటర్, పెదకాకాని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ఆస్పత్రిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ డాక్టర్లు, ఏఎన్ఎంలు విధుల్లో తప్పక ఉండాలన్నారు. తొలుత మండలంలోని నంబూరు-3 ఆరోగ్య ఉపకేంద్రంలోనూ, యాదవపాలెం అంగన్‌వాడీ సెంటర్‌లో జరిగిన టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. టీకాలు తీసుకున్న గర్భిణి వివరాలు , పిల్లల వివరాల రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. అనంతరం పెదకాకాని ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి పిల్లల టీకాల నిల్వ ఉంచే ఐఎల్ఆర్, డీప్ ఫ్రిజ్, హాజరు పట్టిక, ఓపీ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ వీఎస్ఆర్ శాస్త్రి, పీహెచ్‌సీ వైద్యాధికారి పి.ప్రవీణదీప్తి, సూపర్‌వైజర్ పునులూరు శ్రీను పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పొన్నూరు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, జనసేన పార్టీ పొన్నూరు సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు పాల్గొని వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ములుకుదురులో రూ.6 లక్షలు, నండూరులో రూ.7 లక్షలు, వల్లభరావుపాలెంలో రూ.6.50 లక్షలు, ఉప్పరపాలెంలో రూ.5.50 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో సిమెంట్‌రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ములుకుదురులో ఇంటింటికి చెత్త సేకరణకు నూతన వాహనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, బి.రామారావు, బి.బాబూరావు, మొవ్వ వెంకటకృష్ణ, చెలమశెట్టి సీతారామయ్య పాల్గొన్నారు.

షేడ్ నెట్‌లకు కేరాఫ్ వేజండ్ల

● కూరగాయల మొక్కలకు ప్రసిద్ధి ● ఇతర ప్రాంతాలకు సరఫరా

చేబ్రోలు: కూరగాయల సాగుకు జిల్లాలో నారాకోడూరు, వేజండ్ల ప్రసిద్ధి. సీజన్‌లో పెంపకానికి మొక్కల అవసరమైతే ఆ ప్రాంతానికి వెళ్లాల్సిందే. వివిధ కూరగాయలతో పాటు ఇళ్లలో పెంపకానికి అవసరమైన మొక్కలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. దీంతో మొక్కల పెంపక కేంద్రంగా ప్రసిద్ధికెక్కింది.

ప్రస్తుతం వేజండ్ల, నారాకోడూరు, సుద్దపల్లి ప్రాంతాల్లో సుమారు 30 ఎకరాల్లో షేడ్ నెట్‌ల ద్వారా వివిధ రకాల కూరగాయ మొక్కలను పెంచుతున్నారు. మెట్ట రైతులకు కూరగాయ మొక్కలను షేడ్ నెట్‌ల కింద పెంచి రైతులకు అందజేస్తున్నారు. ఈ మొక్కలు ఇతర మొక్కల కంటే తెగుళ్లు, పురుగుల నుంచి తట్టుకొని లాభాలు బాట పట్టిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. జిల్లా నలుమూలల నుంచే కాక ప్రకాశం, కృష్ణా జిల్లాల నుంచి రైతులు ఇక్కడ షేడ్ నెట్‌లలో పెరుగుతున్న వివిధ రకాల కూరగాయ మొక్కలను తీసుకొని వెళ్లి సాగు చేస్తున్నారు. వేజండ్ల అడ్డరోడ్డులోని తేజ నర్సరీలో ప్రారంభించిన షేడ్ నెట్‌ల పెంపకం క్రమంగా విస్తరించింది.

ఉద్యాన శాఖ ప్రోత్సాహం..

షేడ్ నెట్‌ల ద్వారా మొక్కల పెంపకాన్ని గతంలో ఉద్యాన శాఖాధికారులు ప్రోత్సహించారు. ఎకరానికి సుమారు రెండు లక్షల రూపాయల మేర ఖర్చు పెట్టి మొక్కలను పెంచుతున్నట్లు నర్సరీలకు రాయితీ ద్వారా అవసరమైన విత్తనాలు అందించి ప్రోత్సహించాలని యజమానులు కోరుతున్నారు. మిర్చి, వంగ, టమోటా, బొప్పాయి, క్యాప్సికం, బంతి పూల మొక్కల నారును షేడ్ నెట్ల ద్వారా పెంచుతున్నారు.

నర్సరీ మొక్కలకు డిమాండ్.



మండలంలోని వేజండ్ల అడ్డరోడ్డు వద్ద షేడ్ నెట్ విధానంలో నారుమళ్లు



నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

ప్రస్తుత సీజన్‌లో షేడ్ నెట్‌ల ద్వారా పెంచిన మొక్కల సాగుపై రైతులు ఆసక్తి పెరిగింది. దీంతో డిమాండ్ బాగా పెరిగింది. గతంలో రైతులు వివిధ రకాల నారుమళ్లు పోసుకొని మొక్కలను పెంచి వాటిని నాటేవారు. మారిన పరిస్థితుల్లో రైతులు షేడ్ నెట్‌ల కింద పెరిగిన మొక్కలను కొనుగోలు చేసి వాటిని వ్యవసాయ భూమిలో నాటి సాగు చేస్తున్నారు. దీని వలన రైతులకు నాణ్యతతో పాటు సమయం ఆదా అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. మెట్టలో ఎకరం పొలంలో మిర్చి సాగు చేసే రైతులకు 12 వేల నుంచి 15 వేల మొక్కలు అవసరం అవుతాయి. ఎండు మిర్చి రకం మొక్క ఒక్కొక్కటి రూ.1.50, మిగిలిన రకం మొక్కలు రూ.0.75 చొప్పున విక్రయిస్తున్నారు. కొంత మంది నర్సరీల యజమానులు రైతులు తీసుకొని వచ్చిన విత్తనాలతో మొక్కలను పెంచి పెంపకం ఖర్చులు తీసుకుంటున్నారు.

ఎడతెరిపి లేని వర్షాలతో నష్టం

గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు రైతులకు నష్టాలను కలుగు చేస్తున్నాయి. విత్తనం నాటిన తరువాత నుంచి 45 నుంచి 50 రోజులలో నర్సరీల నుంచి మొక్కలను తీసుకువెళ్లి నాటాల్సి ఉంది. భారీ వర్షాలు, తుఫాన్‌లు కారణంగా 70 నుంచి 80 రోజులు అయినా రైతులు మొక్కలు తీసుకువెళ్లి నాటడానికి అనుకూల పరిస్థితులు లేవు. దీంతో నర్సరీలలోనే మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. మిర్చి మొక్కలు నాటిన తోటలు వర్షాలకు ఉరకెత్తటం, దెబ్బతింటున్న పరిస్థితి నెలకొంది. ఎడతెరిపి లేని వర్షాలు నర్సరీ యజమానులతో పాటు, రైతులకు చేటు చేస్తున్నాయి.

ఖర్చులు అధికం అవుతున్నాయి



గత కొన్ని ఏళ్లుగా నర్సరీ ద్వారా మొక్కల పెంపకం చేస్తున్నా. రైతులు తీసుకొని వచ్చిన విత్తనాలతో నర్సరీలో మొక్కలు పెంచుతున్నాం. ప్రభుత్వం, ఉద్యానశాఖ ద్వారా ప్రోత్సాహం అందించాలి. నర్సరీల నిర్వహణతో పాటు, రైతులపై అదనంగా భారం పడుతుంది. ప్రస్తుతం పెంపకం ఖర్చులకే మొక్కలను పెంచుతున్నాం. నర్సరీలకు కావలసిన మంచి విత్తనాలను అధికారులు ముందుగా నమోదు చేసుకొని కొంత రాయితీపై అందజేస్తే బాగుంటుంది.

– రమేష్‌రెడ్డి, నర్సరీ యజమాని, వేజండ్ల

షేడ్ నెట్‌లతో మేలు



షేడ్‌నెట్‌ల ద్వారా పెరిగిన మొక్కలు ఆరోగ్యవంతంగా ఉంటాయి. షేడ్ నెట్ల పెంపకానికి రైతులకు తగిన ప్రోత్సాహం అందిస్తున్నాం. ఎకరానికి ఎనిమిది లక్షల రూపాయిలు ఉద్యానశాఖ రాయితీని ఇస్తోంది. చేబ్రోలు మండలంలోని మూడు ప్రాంతాల్లో 15 మంది రైతులు షేడ్ నెట్ల ద్వారా మొక్కల పెంపకం చేస్తున్నారు.

– పి.ఉష, ఉద్యాన శాఖాధికారి, పొన్నూరు

ప్రయాణికుల సమస్యలకు పరిష్కారం



డిపో మేనేజర్ అజిత కుమారి

పొన్నూరు: ఆర్టీసీ పొన్నూరు డిపో పరిధిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని డిపో మేనేజర్ అజిత కుమారి తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆమె ఫోన్ ద్వారా ప్రయాణికుల నుంచి సమస్యలు ఫిర్యాదులు తెలుసుకున్నారు. పొన్నూరు డిపో నుంచి నగరం మీదుగా రేపల్లె, మచిలీపట్నానికి బస్సును ఏర్పాటు చేయాలని పొన్నూరు పట్టణానికి చెందిన మోజేష్ నాయుడు కోరారు. సింహపురి రైలుకు లింక్ సర్వీసుగా బాపట్లకు బస్సు ఏర్పాటు చేయాలని యాసిన్ బాబా కోరారు. పొన్నూరు నుంచి గుంటూరుకు అదనంగా బస్సులు ఏర్పాటు చేయాలని పలువురు ప్రయాణికులకు కోరారు. ప్రయాణికుల సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేసి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని డీఎం తెలిపారు.

పాము కాటుతో వృద్ధురాలి మృతి

కాకుమాను: పాము కాటుతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన పెదనందిపాడు మండలం పెదనందిపాడులో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన నూర్ బాషా మస్తాన్‌బీ(60) ఇంట్లో వంటింటి పనులు చేసే సమయంలో పాము కాటుకు గురైయ్యింది.

గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు.

ఆధార్ ఆప్‌డేట్‌కు మరో అవకాశం

22 నుంచి సచివాలయాల్లో శిబిరాలు

పొన్నూరు: బ్యాంకు ఖాతా, పాన్‌కార్డు, విద్య, ఉద్యోగాల్లో ప్రవేశాలతో పాటు ప్రభుత్వ పథకాల లబ్ధికి ఆధార్ తప్పనిసరైంది. ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య లేకపోయినా.. అందులో సాంకేతిక తప్పిదాలు ఉన్నా.. తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు ఉండాలని, ఇప్పటికే తీసుకుని చాలా కాలమైన వారు నవీకరించుకోవాలని ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తోంది. ఆధార్ కార్డుకు వయసుతో నిమిత్తం లేదు. పిల్లలకు ఐదేళ్లు దాటాక బయోమెట్రిక్ నవీకరించుకోవాల్సి ఉంటుంది. ఆధార్ నమోదు చేసుకుని పదేళ్లు దాటిన వారూ తమ వేలిముద్రలు, కనుపాపలు పునర్ స్వీకరణ చేయించుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ శిబిరాలు కొత్త ఆధార్ కార్డుల నమోదు, వేలిముద్రల నవీకరణ, చిరునామాలు, ఆధార్‌పై వ్యక్తిగత చిత్రం నవీకరణ, ఫోన్ నెంబరు మార్చుకునేందుకు దోహదపడతాయి. ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు వార్డు సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ చేయనున్నారు.

ఎప్పుడెప్పుడంటే...

22న సాంబశివ నగర్ 1, ఇందిరా కాలని, నాగుల చెరువు సచివాలయాలు, 23న ఎస్సీ కాలనీ 1, ఎస్సీ, ఎస్టీ కాలనీ 1, జయభారత్ రెడ్డి సచివాలయం, 24న సాంబశివ నగర్ 17, ఉర్దూ స్కూల్, గాంధీ పార్క్, డిఆర్‌కె కాలని సచివాలయాలు, 25న జెండాచెట్టు 2, ఎస్సీ కాలనీ 2, క్యాబిన్‌పేట సచివాలయాల్లో ఆధార్ సేవలు పొందాలని పేర్కొన్నారు.

ఆధార్ ప్రత్యేక శిబిరాలు వినియోగించుకోవాలి



వార్డు సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నాం. చాలా మంది అప్‌డేట్ చేసుకోకపోవడం వలన ఇబ్బందిపడుతున్నారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి.

-ముప్పాళ్ల రమేష్‌బాబు, కమిషనర్, పొన్నూరు


వ్యాపార రంగంలో డిజిటల్ కీలకపాత్ర



ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్‌కు సన్మానం


గుంటూరు రూరల్: ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించే వ్యాపార రంగంలోని ప్రతి వ్యవహారంలో డిజిటలైజేషన్ ప్రక్రియ కీలక పాత్ర పోషిస్తోందని అందుకు అనుగుణంగా ఏంబీఏ విద్యార్థులు అంకుర పరిశ్రమల స్థాపనపై దృష్టి సారించాలని కడప యోగి వేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ టి.శ్రీనివాస్ పేర్కొన్నారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఎంబీఏ విద్యార్థులకు బికమింగ్ ఎథికల్ ఎంటర్ ప్రెన్యూర్ ఇన్ డిజిటల్ ఎకానమీ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. డిజిటలైజేషన్ వ్యాపార రంగం ప్రపంచ దశదిశనే మార్చేశాయని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని పేర్కొన్నారు. ఎంబీఏ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని, ఆధునిక సాంకేతిక కోర్స్‌లను ఎంబీఏ విద్యార్థులకు జత చేస్తూ మెరుగైన విద్యాబోధన అందించడం ద్వారానే మంచి ప్యాకేజీలతో ప్రసిద్ధి చెందిన కంపెనీలలో తమ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ టి.శ్రీకృష్ణ పాల్గొన్నారు.

ఐపీఏ ప్రధాన సంపాదకుడిగా డాక్టర్ విద్యాధర్



బాధ్యతలు స్వీకరిస్తున్న విద్యాధర్

గుంటూరు రూరల్: ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ (ఐపీఏ)కు ఇటీవల ఎన్నికలు జరిగాయి. ఇండియన్ జర్నల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రధాన సంపాదకుడిగా చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.విద్యాధర్‌ను ఎన్నుకున్నారు. శనివారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విద్యాధర్ మాట్లాడుతూ.. ఎన్నికల అధికారిగా డాక్టర్ వడ్లమూడి రావు పాల్గొన్నారని తెలిపారు. ఎందరో ప్రముఖులు నిర్వర్తించిన బాధ్యతలను తాను స్వీకరించటం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐపీఏ అధ్యక్షుడు డాక్టర్ టీవీ నారాయణ పాల్గొన్నారని తెలిపారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, కార్యదర్శి సీఎస్ శ్రీనివాస్, కోశాధికారి గోపాలకృష్ణ అభినందించారు.



తాగునీరు వృథా

పట్టణంలోని నిడుబ్రోలు ఎరుకల వాడ ప్రధాన రహదారిలో నెల రోజులుగా తాగునీటి పైపు లైను లీకవుతోంది. ప్రతి రోజూ వందల లీటర్ల తాగునీరు వృథా అవుతోంది. రోడ్డంతా బురదమయంగా మారుతుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పైపులైనుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. –పొన్నూరు

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి



కాకుమాను: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలని మండల వ్యవసాయశాఖాధికారి కె.కిరణ్మయి అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో మండలంలోని ఎరువుల దుకాణ యజమానులతో సమావేశం శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి దుకాణంలో ఎరువులు, ధరల పట్టిక తప్పని సరిగా ఏర్పాటు చేయాలని కోరారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు కొనుగోలు రసీదులు ఇవ్వాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైన అధిక ధరలకు ఎరువులు, పురుగు మందు విక్రయిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులు సరైన భావ వ్యక్తీకరణ అలవర్చుకోవాలి

ప్రముఖ హాస్యనటుడు జెన్నీ



గుంటూరు రూరల్: విద్యార్థులు సరైన భావవ్యక్తీకరణ, సాంకేతిక నైపుణ్యాలను అలవరుచుకుని అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ప్రముఖ హాస్య నటుడు జెన్నీ తెలిపారు. శనివారం నగరశివారుల్లోని లాంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు భావవ్యక్తీకరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే ప్రతి విద్యార్థి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలని చెప్పారు. విద్యార్థులు కేవలం మార్కులపై మాత్రమే కాకుండా ఇతర వ్యక్తిత్వ వికాసం, సమాజంపై అవగాహన, తదితర అంశాలపైనా దృష్టి సారించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన శిక్షణ అందించేందుకు తమ కళాశాల ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా అతిథిని కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు, సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్, కళాశాల అధ్యాపకులు ఘనంగా సన్మానించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు వేజండ్ల విద్యార్థులు



రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన వేజండ్ల హైస్కూల్ విద్యార్థులతో హెచ్ఎం

చేబ్రోలు: మండలంలోని వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు బాలికలు వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఎంపిక పోటీలు నిర్వహించారు. హైస్కూల్‌కు చెందిన మట్టుపల్లి సుమశ్రీ, బింగినపల్లి మనీష, చల్లగిరి గీతా మాధురి, మట్టుపల్లి జయసంజన, పఠాన్ షాహీదా ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. అండర్ -17 బాలికల వాలీబాల్ పోటీలలో మొత్తం 12 మంది జట్టు సభ్యులలో వేజండ్లకు చెందిన ఐదుగురు ఎంపికయ్యారు. అక్టోబర్ 21 నుంచి 23వ తేదీ వరకు అనంతపురం జిల్లా హిందూపురంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో వీరు పాల్గొననున్నారు. వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను హెచ్ఎం టి.విజయశ్రీ, ఎస్ఎంసీ చైర్మన్ పఠాన్ రబియా నస్రా, పీఈటీ టి.వెంకటేశ్వరరావు అభినందించారు.

ఉత్సాహంగా ఫెన్సింగ్ క్రీడా పోటీలు



విజేతలను అభినందిస్తున్న డాక్టర్ జీపీ రాజు

పెదకాకాని: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కాకినాడ జేఎన్‌టీయూ అంతర్ కళాశాలల టోర్నమెంట్ సెక్రటరీ డాక్టర్ జీపీ రాజు అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు వీవీఐటీ కళాశాలలో కాకినాడ జేఎన్‌టీయూ సెంట్రల్ జోన్ అంతర్ కళాశాలల క్రీడా పోటీలలో భాగంగా ఫెన్సింగ్ పోటీలు నిర్వహించారు. డాక్టర్ జీపీ రాజు ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతున్న పట్టుదలతో రాణించాలని కోరారు. మూడు విభాగాలలో మహిళలు, పురుషులకు నిర్వహించిన ఈ పోటీలలో 16 కళాశాలల నుంచి 32 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పురుషుల విభాగంలో ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థి ఎం.వెంకటేష్, కిట్స్ కళాశాలకు చెందిన పి.స్రుజన్ సిన్హా, మహిళల విభాగంలో చలపతి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన కె.రత్నకుమారి ప్రతిభ చాటి ప్రథమ విజేతలుగా నిలిచారు. వీరితో పాటు ఇతర విజేతలకు సర్టిఫికెట్, షీల్డ్ బహూకరించారు. విజేతలను వీవీఐటీ అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, ఈవెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్.అరుణ్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్స్ ఎన్.సారయ్య, డాక్టర్ ఎం.గిరిధర్ అభినందించారు.

మార్కెట్‌కు అనుగుణంగా వ్యూహాలు ఉండాలి

● పూణెలోని బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ వైస్ ప్రెసిడెంట్ రే మహారాణా
● విజ్ఞాన్‌లో అతిథి ఉపన్యాస కార్యక్రమం



మాట్లాడుతున్న రే మహారాణా

చేబ్రోలు: మార్కెట్‌లో మార్పులకు అనుగుణంగా వ్యూహాలను రచించి అభివృద్ధి చేస్తేనే నిలదొక్కుకుంటామని పూణెలోని బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ వైస్ ప్రెసిడెంట్ ఎం.రే మహారాణా అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'బిజినెస్ డెవలప్‌మెంట్- సేల్స్ - డిస్ట్రిబ్యూషన్- కెరీర్ పాత్ గ్రోత్- ఇంటర్వ్యూ టెక్నిక్స్- క్యాంపస్ టు కార్పొరేట్ స్పెషలిస్ట్' అనే అంశంపై ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఎం. రే మహారాణా మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను అర్థం చేసుకోవడం, మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉన్న వారికి ఇంటర్వ్యూలో ఎంపికవడానికి అవకాశాలను పెంచుతుందని చెప్పారు. క్యాంపస్ టు కార్పొరేట్ అనేది విద్యార్థులను విద్యా జీవితంలో నుంచి కార్పొరేట్ ప్రపంచంలోకి మారుస్తూ, వారికి కావాల్సిన సామర్థ్యాలు, సాంకేతికతలు నేర్పిస్తుందన్నారు. కంపెనీలో ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదగాలంటే.. ఉద్యోగి ప్రతి దశలో నిరంతరం నేర్చుకోవడం, కొత్త సాంకేతికతలను, మార్కెట్ ధోరణులను అర్థం చేసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. అద్భుతమైన డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఉన్న సంస్థలు వేగంతో పాటు సమర్థవంతంగా కస్టమర్ అవసరాలు తీర్చగలవన్నారు.

క్రెడిట్ లిమిట్ పెంచుతానని రూ.91 వేలు మోసం

బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు

లక్ష్మీపురం: క్రెడిట్ లిమిట్ అంటూ మోసంపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. ముత్యాలరెడ్డినగర్‌కు చెందిన దార్ల రంజిత్‌కుమార్, విద్యుత్ కాంట్రాక్ట్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఇటీవల కాలంలో రంజిత్‌కుమార్ బ్యాంక్ లావాదేవీలు సక్రమంగా ఉండటంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు క్రెడిట్ కార్డు మంజూరు చేశారు. అయితే క్రెడిట్ కార్డు ఇటీవల పలు రకాల పనులకు వినియోగిస్తు వచ్చాడు. అయితే క్రెడిట్ లిమిట్ పెంచేందుకు బ్యాంక్ ఖాతాను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్న సమయంలో ఒక నంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. ఖాతాలో క్రెడిట్ లిమిట్ పెంచేందుకు పరిశీలిస్తున్నారా అని అడిగి ఖాతా వివరాలు తెలియజేయాల్సిందిగా చెప్పడంతో నమ్మిన రంజిత్‌కుమార్ ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు విభాగం నుంచి ఫోన్ వచ్చిందని, ఖాతా వివరాలు, ఓటీపీలు చెప్పడంతో క్రెడిట్ కార్డులో ఉన్న రూ.91,215 వేలు ఒక్కసారిగా మాయం అయ్యాయి. ఇదేంటి అని పరిశీలించి వచ్చిన ఫోన్ కాల్‌కు తిరిగి ప్రయత్నించగా ఫోన్ పని చేయలేదు. దీంతో బాధితుడు దిక్కుతోచక అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.